దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్

నిజాంపేట్: 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ కోరారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ కార్మికులందరూ సమ్మెలో పాల్గొంటారని కమిషనర్‌కు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో పి. పెంటయ్య, సత్యనారాయణ, చెన్నయ్య, గురవయ్య, మహిపాల్, నరసింహ, నాగేషు, టి.శ్రీను, బాలయ్య, శ్రీరాములు, కురుమూర్తి, బుజ్జమ్మ, ఎర్రమంజిలి, మమత, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సిద్ధిరాములు

కుత్బుల్లాపూర్: తెలంగాణ మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కుంట సిద్ధిరాములు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బూర్గుబావి హన్మంత్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధిరాములు మాట్లాడుతూ.. మున్నూరు కాపులను ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేసే దిశగా తనవంతు పని చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్నకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు బూర్గుబావి సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నడుపుతున్న వారిని కట్టడి చేయాలని సీపీఐ నాయకులు మంగళవారం ఉప కమిషనర్ నరసింహకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. రోడ్లపై అక్రమంగా వ్యాపారాలు నిర్విహిస్తూ కొనుగోలుదారులకు నకిలీ వస్తువులను అంటగడుతూ మోసం చేస్తున్నారని వివరించారు. రోడ్లపైకి జరిగి షెడ్లు వేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్, నాయకులు నర్సింహారెడ్డి, కనకయ్య, ప్రభాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం అడ్డగింపు

- బౌన్సర్లతో కబ్జాదారులు హల్చల్... కంగుతిన్న అధికారులు
- పోలీసులకు సర్కిల్ అధికారుల ఫిర్యాదు
- పార్కు స్థలంలో ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం!



స్థలం వద్ద సంక్షేమ సంఘం నేతలు, కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: అది పార్కు స్థలం.. అక్కడ సుమారు గజం లక్ష రూపాయల పై మాటే.. రెండు కోట్ల రూపాయలు విలువచేసే ఈ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. ఇక అంతే ఒక డాక్యుమెంట్ సృష్టించి పార్కు స్థలానికి ఎసరు పెట్టేందుకు సిద్ధమయ్యారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ బ్యాంక్ కాలనీ ప్లాట్ నెంబర్ -11 , రోడ్డు నెంబర్ -1లో ఈ స్థలం ఉంది. సర్కిల్ అధికారులు.. మరో వైపు సంక్షేమ సంఘం నేతలు ఆ స్థలాన్ని కాపాడుకునే దిశగా అడుగులు వేశారు. వివాదాస్పదంగా మారిన ఈ స్థలంపై 2019లో ఏకంగా మూడుసార్లు కోర్టుకు వెళ్లిన అసోసియేషన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో సర్కిల్ అధికారులు ఇటీవల ప్రణాళికలు రూపొందించి 200 గజాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.6 లక్షల నిధులు మంజూరు చేసి మంగళవారం పనులు ప్రారంభించే క్రమంలో కబ్జాదారులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇప్పటికే ఈ స్థలం జీహెచ్‌ఎంసీకి బదలాయింపు జరిగింది. అయినప్పటికీ ఇది ప్రైవేట్ స్థలం అంటూ బౌన్సర్లను తీసుకువచ్చి హల్చల్ చేయడంతో అక్కడ పని చేసే కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకుని సంక్షేమ సంఘం, కాలనీవాసులు అక్కడికి చేరుకున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

పార్కు స్థలంలో ప్రహరీ నిర్మాణం చేపట్టే క్రమంలో కబ్జాదారుల నుంచి బెదిరింపులు రావడంతో డీఈ పాపమ్మ, ఏఈ అనురాగ్, టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అభివృద్ధి పనులు అడ్డుకుంటూ కబ్జాదారులు బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై సీఐ విజయవర్ధన్‌ను 'సాక్షి' వివరణ కోరగా... అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న వారిపై కేసుల నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సర్కిల్ అధికారులు ప్రొటెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే తప్పకుండా పోలీసులను పంపి పనులు సక్రమంగా జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

మహిళలు వ్యాపారాల్లో రాణించాలి



ఫుడ్ స్టాళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్

దుండిగల్: ప్రభుత్వ సహకారంతో మహిళలు వ్యాపారాల్లో రాణిస్తు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఎదగాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు తినుబండరాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. వాటిని కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ సతీష్, మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, మెప్మా సీఓ మంజుల, రిసోర్స్ పర్సన్లు శాంత, రాణి, మల్లేశ్వరి, అరుణ, నాగమణి, లక్ష్మి, మెప్మా సంఘాల సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న బలరామ కృష్ణ

కుత్బుల్లాపూర్: మానవ అక్రమ రవాణాను నిర్మూలించడం అందరి బాధ్యతని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామ కృష్ణ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం తమ సంస్థ 29 సంవత్సరాల నుంచి పని చేస్తుందన్నారు. 29,500 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించినట్లు గుర్తు చేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సునీత కృష్ణన్, సంబంధిత ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పోలీస్, జ్యుడీషియల్, విద్యాశాఖల సహకారంతో పని చేస్తున్నామన్నారు. అనంతరం సంస్థ సూపర్ వైజర్ జ్యోతి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అని వివరించారు. ఆదిలోనే దీన్ని అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించుకోవచ్చని, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ సూపర్‌వైజర్ అనిత, సీనియర్ కో ఆర్డినేటర్ సురేష్ కుమార్, అంబర్ సింగ్, భూపాల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పేదలకు పథకాలు అందేలా కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఏరో నాటికల్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పథకాలతో నిరుపేదలకు లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నామని, సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం చింతల్‌లోని క్యాంప్ కార్యాలయంలో రూ.10 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏరో నగర్ సొసైటీ సభ్యులు

పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ప్రగతినగర్ ఏరోనాటిక్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ (ఏరో నగర్) సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తిరుపతిరావు, సెక్రటరీ రాజగోపాల్, కోశాధికారి సాయిప్రసాద్, ఉపాధ్యక్షురాలు వీరారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కుత్బుల్లాపూర్: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆర్‌ఎస్‌కే హైస్కూల్‌లో కేఐ ల్యాబ్స్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌ఏ) ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్‌ఆర్‌ఎస్‌ఏ శాస్త్రవేత్త ఆర్.శ్రీనివాస్ హాజరై రాకెట్ నమూనా, అంతరిక్షంలోకి శాటిలైట్లను తీసుకువెళ్లి కక్ష్యలోకి ప్రవేశపెట్టే అంశాలను విద్యార్థులకు వివరించారు. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకుని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో చదవాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, వినోద్ జాదవ్, భూపాల్‌రెడ్డి, నర్సింహులు, ఆర్‌ఎస్‌కే స్కూల్ కరస్పాండెంట్ రామేశ్వర్‌రెడ్డి, కేఐ ల్యాబ్స్ సీఈవో కరీం ఇమ్రాన్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఎస్‌ఏ శాస్త్రవేత్త ఆర్.శ్రీనివాస్

నిందితులను శిక్షించాలి



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సుభాష్‌నగర్: ఉద్యమకారిణి అంజలి మృతిపై విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సూరారం అంబేడ్కర్ భవన్‌లో ఉద్యమకారిణి అంజలి పార్థివ దేహానికి ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. రాజకీయ ఒత్తిళ్లకు పోలీసులు తలొగ్గి కేసును నీరుగారుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అమర్‌బాబు, ఉపాధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, అఖిల భారత రాష్ట్రీయ దళిత సేన జాతీయ అధ్యక్షుడు జేమ్స్, ఐఎన్‌టీయూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దూలపల్లి పీఏసీఎస్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న బ్యాంకు చైర్మన్

సుభాష్‌నగర్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది దూలపల్లి పీఏసీఎస్. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కుత్బుల్లాపూర్ పీఏసీఎస్ బ్యాంకుకు మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఐఎస్‌ఓ సర్టిఫికెట్ పొందడం గర్వంగా ఉందని బ్యాంక్ చైర్మన్ గరిసే నరేందర్ రాజు అన్నారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పీఏసీఎస్ బ్యాంకుల పనితీరుపై సర్వే జరిగింది. మంగళవారం సెక్రెటరీలో ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, హెచ్‌వైఎం సంస్థ ఎండీ శివయ్య చేతుల మీదుగా బ్యాంక్ సీఈవో తీగల కృష్ణతో కలిసి చైర్మన్ గరిసే నరేందర్‌రాజు అవార్డును అందుకున్నారు. 62 సంఘాలు ఉండగా తమ సంఘానికి మొదటి అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. సంవత్సరానికి రూ.250 కోట్ల లావాదేవీలతో బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.